క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. పార్టీ నేతలు కొడవలూరు ధనుంజయరెడ్డి, భక్తవత్సలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం

నెల్లూరు (అర్బన్): కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సీబీఐపీ జాతీయ పురస్కారాన్ని ఢిల్లీలో ఇటీవల అందుకున్న కలెక్టర్ చక్రధర్‌బాబును నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏఆర్డీ సంస్థ డైరెక్టర్ బషీర్ సోమవారం సత్కరించారు. కలెక్టర్‌కు అభినందనలను తెలియజేశారు.

గంజాయి కేసులో ఇద్దరికి ఏడాది జైలు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయ కేసులో నేరం రుజువు కావడంతో చంద్రబాబునగర్‌కు చెందిన పఠాన్ ఆశ, కరిముల్లాకు ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానాను విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సుయోధన సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు... ఎక్సైజ్ (ప్రస్తుత ఎస్ఈబీ) ఇన్‌స్పెక్టర్ నరహరి తన సిబ్బందితో కలిసి 2018, జూలైలో చంద్రబాబునగర్‌లో గంజాయి విక్రయాలపై దాడులు చేశారు. ఈ క్రమంలో వీరిని అరెస్ట్ చేసి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసులో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

హక్కులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పోరాడి సాధించుకున్న మహిళల హక్కులను కాపాడుకుందామని ఏసీ స్టేడియం మహిళా వాకర్స్ ప్రెసిడెంట్ భారతి పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. వెంకటాద్రిరెడ్డి, డాక్టర్ షరీనా, రాఘవరెడ్డి, బలరామనాయుడు, రాఘవేంద్రశెట్టి, నరసింహారెడ్డి, శ్రీమన్నారాయణ, అరుణాచలం, ఆదిలక్ష్మి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరాల కేసులపై సమీక్ష

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక నేరాల కేసుల్లో త్వరితగతిన విచారణను పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. నెల్లూరు నగర సబ్ డివిజన్ పరిధిలో రూ.పది లక్షలకు పైబడిన ఆర్థిక నేరాల కేసులపై తన కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. కేసులను ఎప్పుడు నమోదు చేశారు.. దర్యాప్తులో పురోగతి.. పెండెన్సీకి గల కారణాలను తెలుసుకున్నారు. కేసుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశనం చేశారు. నగర ఇన్‌స్పెక్టర్లు సురేంద్రబాబు, సుబ్బారావు, అన్వర్‌బాషా, నరసింహరావు, రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సులపై స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైమ్): సిటీ బస్సులపై స్పెషల్ డ్రైవ్‌కు నగర ట్రాఫిక్ అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో సుమారు 30 సిటీ బస్సులున్నాయి. వీటి రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, ఇన్సురెన్స్ సర్టిఫికెట్లతో పాటు డ్రైవర్లకు లైసెన్సులున్నాయాననే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సిటీ బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలతో సైతం సమావేశాలను నిర్వహించనున్నామని ట్రాఫిక్ పోలీస్ అధికారులు వెల్లడించారు.

ఐక్య ఉద్యమాలతో ముందుకెళ్దాం

నెల్లూరు (అర్బన్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వివిధ ప్రభుత్వ శాఖల అసోసియేషన్ నేతలను కలుపుకొని ఐక్య ఉద్యమాలను నిర్మిద్దామని ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆర్టీసీ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో అనుబంధ సంఘ ఉద్యోగ నేతలు, వివిధ శాఖల ప్రతినిధులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా నేతలు రామ్‌ప్రసాద్, విజయనిర్మల, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఇబ్బందులున్నా ఆగని సంక్షేమం



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్ర విభజన, కరోనా తదనంతరం రాష్ట్రంలో ఆర్థిక ఒడిదొడుకులున్నా, ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. 17, 18, 19వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలు, గృహ సారథులతో సమావేశాన్ని మినీబైపాస్ రోడ్డులోని శుభమ్ కన్వెన్షన్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలోని అందరూ సమన్వయంతో వ్యవహరించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి పాటుపడాలని కోరారు. రూరల్ పరిధిలో అత్యధిక మెజార్టీ సాధించే దిశగా కృషి చేయాలన్నారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నానని చెప్పారు. 25 ఏళ్లుగా తాను రాజకీయాల్లో ఉన్నానని, అధికార పార్టీ ఎమ్మెల్యేగా పనిచేయడంతో ఆయా ప్రాంతాల అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు కోటంరెడ్డి పిలిచేవారుకాదు

నియోజకవర్గంలో గతంలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమాలకు తనను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆహ్వానించేవారు కాదని ఎంపీ చెప్పారు. దీంతో రూరల్ ప్రజలకు దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. ప్రజలు, నేతలు, కార్యకర్తలకు చేరువయ్యే అవకాశం వచ్చిందని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గౌరి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు ఏసునాయుడు, సురేష్‌రెడ్డి, రవి, కార్పొరేటర్లు అశోక్‌నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సత్తార్, రామ్మోహన్, నాగరాజు, శ్రీనివాసయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దర్గామిట్టలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులను ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఈఓ గంగాభవాని ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. 8, 9వ తరగతి విద్యార్థినులకు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ మాస్టర్ రవి తెలిపారు. సీనియర్ కరాటే మాస్టర్ వసంతకుమార్, శివ, వాసు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ నేత నాగేంద్రకు పురస్కారం



నెల్లూరు(బృందావనం): తెలుగు రాష్ట్రాల పరిధిలో దివ్యాంగులకు ఉత్తమ సేవలందించిన నెల్లూరుకు చెందిన దివ్యాంగ నేత నాగేంద్రను వెండినంది పురస్కారంతో సత్కరించారు. విజయవాడలోని కన్యకాపరమేశ్వరి అన్నదాన సత్ర భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య వాకర్స్ అసోసియేషన్, వాసవీ సూపర్‌స్టార్ అధ్యక్షురాలు లలితారాణి ఆధ్వర్యంలో తనను సత్కరించారని చెప్పారు.

ఓపీఎస్‌ను అమలు చేయరూ..



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

నెల్లూరు (టౌన్): సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఓపీఎస్‌ను అమలు చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆపస్ మహాసభలను రెండో రోజు సోమవారం నిర్వహించారు. విద్య, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రతినిధులు చర్చించి పలు తీర్మానాలు చేశారు. దీంతో పాటు భవిష్యత్తు ప్రణాళికలను సైతం రూపొందించారు. ఏబీఆర్‌ఎస్‌ఎమ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివానంద, జాతీయ సంఘటనా మంత్రి లక్ష్మణ్, ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్లు ముఖహాజరును తప్పక వేయాలని ఆదేశించారు. వ్యాధుల నిర్ధారణకు అవసరమైన రియేజంట్స్ అయిపోతే ఆస్పత్రి అభివృద్ధి నిధులతో కొనుగోలు చేయాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు గానూ 24 గంటలూ అందుబాటులో ఉంటానన్నారు. ఏడీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, మలేరియా నివారణ ఇన్‌చార్జి అధికారి బ్రిజిత పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నెల్లూరు(బృందావనం): ప్రజల్లో దైవభక్తిని పెంపొందించేందుకు గానూ త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ఎంతో తోడ్పడుతుందని త్రైత సిద్ధాంత - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షుడు సురమౌళి పేర్కొన్నారు. ముత్యాలపాళెం, మాగుంట లేఅవుట్, ఉమ్మారెడ్డిగుంట ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహప్రసాద్, సోమశేఖర్, రమణయ్య, సునీల్, లీలావతి, పద్మజ, సుమలత, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): తూర్పు రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా నగరంలోని 54వ డివిజన్లో ముమ్మర ప్రచారాన్ని పార్టీ నేతలు సోమవారం నిర్వహించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు ఇస్లాంపేట, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పార్టీ నేతలు సలామ్, సత్తార్, ఆయాజ్, ఆనంద్, అంజద్, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటలు, క్విజ్ పోటీలు



నెల్లూరు(బృందావనం): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మినీబైపాస్ రోడ్డులోని మొక్కల పెంపక కేంద్రంలో మహిళలకు చిత్రకళ, పాటలు, క్విజ్, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలను పెన్నా రచయితల సంఘ అధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మహిళా దినోత్సవ విశిష్టత, తదితర అంశాలను వివరించారు.

ఐఎంఏ హాల్లో మహిళా దినోత్సవం రేపు

నెల్లూరు (టౌన్): మహిళా దినోత్సవాన్ని సరస్వతీనగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో బుధవారం నిర్వహించనున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సాధికారత, బాలికా విద్య, తదితర అంశాలపై చర్చించనున్నామని చెప్పారు. మహిళలు తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాలయాలైన ఐఐటీ, ఐఐఎంలలో సమస్యలను పరిష్కరించాలని ఏబీఆర్‌ఎస్‌ఎమ్ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలో జరుగుతున్న ఆపస్ రాష్ట్ర మహాసభలకు హాజరైన కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి మురుగన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఆర్‌ఎస్‌ఎమ్ అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడారు. విజయనగరంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, అనంతపురంలోని కేంద్రీయ విద్యాలయం, తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ఎడ్యుకేషన్‌లో ఖాళీగా ఉన్న 50 శాతం అధ్యాపక, అధ్యాపకేతర ఖాళీలను వెంటనే భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

నెల్లూరు (అర్బన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎనెల్ ఆస్పత్రిలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించనున్నామని హాస్పిటల్ చైర్మన్ దశరథ నాగేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, గైనకాలజీ, తదితర వైద్యసేవలను అందించనున్నామని చెప్పారు.

ఫైలేరియా అధికారిగా వెంకటేశ్వర్లు



నెల్లూరు(అర్బన్): సంతపేటలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా ఫైలేరియా అధికారిగా వెంకటేశ్వర్లు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. మలేరియా విభాగంలో అదనపు అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన ఉద్యోగోన్నతి పొంది ఫైలేరియా అధికారిగా నియమితులయ్యారు.

కుక్కల పట్టివేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్లో గల నల్లకాలువ, తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల పట్టివేతను సోమవారం చేపట్టారు. అనంతరం వీటిని ప్రత్యేక వాహనంలో కార్పొరేషన్ సిబ్బంది తరలించారు.

నేత్రదానం



పిచ్చిరెడ్డి (ఫైల్)


నెల్లూరు (అర్బన్): పడుగుపాడుకు చెందిన పిచ్చిరెడ్డి (63) సోమవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. మోటివేటర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు



నెల్లూరు సిటీ: స్టోన్‌హౌస్‌పేట పరిధిలోని పలు ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ సోమవారం చేపట్టారు. 200 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని రూ.50 వేల జరిమానాను విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించడం నేరమని చెప్పారు. మరోసారి ఇదే తరహాలో ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చికెన్ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్లు నిషేధమనే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యంగౌడ్‌కు సత్కారం



నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ముత్యంగౌడ్‌ను డీసీసీబీ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నేతలు సోమవారం సత్కరించారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, డీసీసీబీ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా నేతలు బాబు, గురునాథం, చెంగయ్య, రమేష్, సత్యనారాయణరాజు, వైద్య శాఖ యూనియన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరుస్తాం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరుస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఏడో డివిజన్లోని నవాబుపేటలో గల చాకలివీధి, అరుణాచలవీధి, తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను పూర్తి చేస్తామని చెప్పారు. డివిజన్లో పూడిక తీయించే కార్యక్రమాన్ని 50 మందితో చేపడుతున్నామని పేర్కొన్నారు. పారిశుధ్య విషయంలో సమగ్ర ప్రణాళికలను రూపొందించేలా అధికారులతో చర్చించామన్నారు. కార్పొరేటర్ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ఆస్తి, కుళాయి పన్నులను ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో వసూలు చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ విభాగ ఉద్యోగులు సమన్వయంతో పన్నులను వసూలు చేయాలని చెప్పారు. ట్రేడ్ లైసెన్స్‌ల పరిధిలోకి అన్ని దుకాణాలను తీసుకురావాలని శానిటరీ విభాగ ఉద్యోగులను ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వాణిజ్య ప్రకటనల ప్రదర్శనలకు కార్పొరేషన్ సూచించిన మార్గదర్శకాలను యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు తప్పక పాటించాలని పేర్కొన్నారు. వీధి కుక్కల బెడదపై 95532 19996 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పల్లకి (వెన్నతాళి) ఉత్సవాన్ని నేత్రపర్వంగా సోమవారం నిర్వహించారు. హనుమంతసేవను రాత్రి జరిపారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట విజయారెడ్డి వ్యవహరించారు.

క్రైమ్ కార్నర్

గాయపడిన మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డులోని జీనిగల వీధికి చెందిన సయ్యద్ నౌషీరా (52) తన కుమారుడు గఫ్రోస్‌తో కలిసి బైక్‌పై నగరంలోని ఓ హాస్పిటల్‌కు గత నెల 24న బయల్దేరారు. వెంగమాంబ సెంటర్ వద్దకు వచ్చేసరికి బైక్‌కు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. గఫ్రోస్‌కు స్వల్ప గాయాలు కాగా, నౌషీరా తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో ఆమెను చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కిమ్స్‌లో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు



నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై ఎస్ఈబీ నెల్లూరు - 1 ఇన్‌స్పెక్టర్ కిశోర్ తన సిబ్బందితో కలిసి సోమవారం దాడులు చేశారు. కొత్తకాలువ సెంటర్ వద్ద అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న అదే ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణ్యాన్ని అరెస్ట్ చేశారు. అతని నుంచి 14 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ నెల్లూరు - 1 ఎస్సై శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి.. నగదు స్వాహా

నెల్లూరు(క్రైమ్): కస్టమర్ కేర్ పేరిట ఫోన్ చేసి వ్యక్తితో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఖాతాలోని నగదును కాజేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని పుత్తా ఎస్టేట్స్‌కు చెందిన శ్రీనివాసరావుకు ఐసీఐసీఐ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. తన ఫోన్ పే యాప్ పనిచేయకపోవడంతో ఆన్‌లైన్లో ఐసీఐసీఐ బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌ను సేకరించారు. కాల్ చేయగా డిస్‌కనెక్టయింది. కొద్దిసేపటికి ఓ వ్యక్తి కస్టమర్ కేర్ ప్రతినిధినంటూ శ్రీనివాసులుకు నోయిడా నుంచి ఫోన్ చేశారు. తాను చెప్పినట్లు చేస్తే ఫోన్ పే పని చేస్తుందని సూచించారు. బాధితుడి ఫోన్లో ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఆయన అకౌంట్‌లోని రూ.8.14 లక్షలను కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో చేతివాటం

నెల్లూరు(క్రైమ్): కిమ్స్ హాస్పిటల్ సమీపంలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్న యువకుడు చేతివాటం ప్రదర్శించారు. దుకాణంలోని మందులను కొద్దికొద్దిగా రోజూ అపహరించి వాటిని బయట విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. దుకాణంలో మందులు తగ్గుతుండటాన్ని గమనించిన యజమాని కొద్ది రోజులుగా నిఘా పెట్టారు. ఈ క్రమంలో యువకుడు మందులను అపహరించి సోమవారం బయటకెళ్తుండగా, అతడ్ని పట్టుకున్నారు. అనంతరం దేహశుద్ధి చేసి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని ఇరువుర్ని స్టేషన్‌కు తరలించి పోలీసులు విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉంగరాలతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): బంగారు ఉంగరాలతో వ్యక్తి ఉడాయించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. సండే మార్కెట్ ప్రాంతానికి చెందిన భరత్‌కుమార్‌జైన్ ఆచారివీధిలో శాంతి జ్యువెలర్స్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల మూడున ఓ గుర్తుతెలియని వ్యక్తి షాపునకు వచ్చి రూ.47 వేలకు రెండు బంగారు ఉంగరాలను కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన నగదును నెట్ బ్యాంకింగ్ ద్వారా పంపానని చెప్పారు. అయితే నగదు షాపు ఖాతాలో ఎంతకీ జమకాకపోవడంతో విషయాన్ని ఆయనకు సిబ్బంది చెప్పారు. నెట్ బ్యాంకింగ్ స్లోగా ఉందని, కొద్దిసేపటికి వస్తుందంటూ వారిని మాటల్లో దించి దుండగుడు అక్కడి నుంచి జారుకున్నారు. దుకాణ సిబ్బంది అతని కోసం గాలించినా ప్రయోజనం లభించలేదు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు భరత్‌జైన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్సై హనీఫ్, సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీల్లో నిందితుడ్ని గుర్తించి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు ఇదే తరహాలో గూడూరులోనూ నేరాలకు పాల్పడ్డారని వెల్లడైంది. దీంతో గూడూరు పోలీసులకు సైతం సమాచారం అందించారు.